క్లుప్తంగా

స్టోర్లకు సకాలంలో సరుకులు తరలించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ రవీంద్ర

గుత్తి: స్టోర్లకు స్టాక్ పాయింట్ నుంచి సకాలంలో సరుకులు తరలించాలని స్టాకిస్టును గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర ఆదేశించారు. పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఉన్న మండలస్థాయి స్టాక్ పాయింట్‌ను సోమవారం ఆర్డీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ మహబూబ్ బాషా, సీఎస్‌డీటీ సూరి, స్టాకిస్టు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేతల అరెస్టు

తాడిపత్రి అర్బన్: పట్టణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపిన వివరాలు.. స్థానిక శివాలయం సమీపంలోని హిందూ శ్మశానవాటిక వద్ద అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న సీఐ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో మద్యం విక్రయిస్తున్న ఆవుల సాయికుమార్, వెంకటసుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, చంద్రగిరి దస్తగిరమ్మను అదుపులోకి తీసుకుని 56 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొనుగోలు చేసి గాంధీ జయంతి రోజు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసు విచారణలో తేలింది. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఘనంగా ఐసీడీఎస్ డే



పామిడిలో ఐసీడీఎస్ డే నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం ఐసీడీఎస్ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. గాంధీజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారుల గాంధీజీ వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, జయంతీ, షేకున్‌బీ, సఫియ, జేఎల్ నారాయణమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి పప్పుశనగ సిద్ధం

పెద్దవడుగూరు: మండలంలోని రైతులు రబీలో సాగు చేసేందుకు పప్పుశనగను సిద్ధం చేసినట్లు ఏఓ మల్లీశ్వరి తెలిపారు. ప్రస్తుతం మండలానికి 150 క్వింటాళ్ల పప్పుశనగ సరఫరా అయినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ పంట సాగు చేయని రైతులు ఆర్బీకేల్లో పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకొస్తే పప్పుశనగ విత్తనం కోసం రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. క్వింటాకు సబ్సిడీ పోనూ రైతులు రూ.4,860 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పుట్లూరు: చెర్లోపల్లి, ఓబులాపురం, దోశలేడులో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం



లక్ష్మికి చెక్కు అందిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

యల్లనూరు: పేదలకు సీఎంఆర్ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) వరంలాంటిదని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన బుక్కాపురం గ్రామానికి చెందిన యం. లక్ష్మి అనే మహిళకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.2 లక్షల చెక్కును అందజేశారు. లక్ష్మి భర్త రవికుమార్ గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి లక్ష్మి తన సమస్యను వివరించగా తప్పక న్యాయం చేస్తానని అప్పట్లో ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎంఆర్ఎఫ్ కింద రూ.2 లక్షలు మంజూరు చేయించారు. ఎనిమిదో తరగతి చదువుతున్న లక్ష్మి కుమారుడి చదువుకు అండగా ఉంటానని హామీ ఇవ్వడంతో ఆమె ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారుకు కృతజ్ఞతలు తెలియజేసింది. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

గాంధీజీ అడుగుజాడల్లో నడుద్దాం

గుంతకల్లు: గాంధీజీ అడుగు జాడల్లో నడుద్దామని వక్తలు పిలుపునిచ్చారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళురిర్పించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బి.సుంకప్ప, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్ మోహన్ గాంధీచౌక్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సెల్ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజినేయులు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఎన్.భీమలింగప్ప పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ చౌక్‌లోని మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. దేశ స్వాతంత్ర్య కోసం ఆయన చేసిన త్యాగాలను ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గోపా జగదీష్ గుర్తు చేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ దౌల్తాపురం ప్రభాకర్, బీజేపీ నాయకులు విశ్వనాథ్, వనగొంది విజయలక్ష్మీ, రవిబాబు తదితరులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు.

గుత్తి: గాంధీ సర్కిల్, మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ స్వాతంత్ర్య పోరాటంలో దేశానికి చేసిన సేవలను వివరించారు. బీజేపీ, టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ నాయకులు గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ పట్టణ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు జిలాన్, రషీద్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్తూరు అనాథాశ్రమం, నిరాశ్రయుల భవనంలోని అనాథలకు పండ్లు, బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు.

యాడికి: గాంధీజీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని డీఎల్‌పీఓ వెంకటరత్నం, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు అన్నారు. సోమవారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో వారు గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ గుప్త ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు, విశాలాక్షి ఖాదీ సభ్యులు స్థానిక ప్రధాన రోడ్డు లోని గాంధీ విగ్రహానికి వారు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నగరూరు పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచు రుక్మాంద రెడ్డి అధ్యక్షతన, రాయలచెరువులో సర్పంచు తలారి అరుణ, లక్షుంపల్లెలో సర్పంచు పద్మనాభరెడ్డి, తూట్రాళ్లపల్లెలో సర్పంచు సంజీవరాయుడు, గుడిపాడులో దండు సావిత్రి, వేములపాడులో సర్పంచు ఓంకారమ్మ ఆధ్వర్యంలో జయింతి నిర్వహించారు. కార్యక్రమంలో యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, నాయకులు తిరుపతి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



గుత్తి: గాంధీ జయంతి వేడుకలను నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ సిబ్బంది

పెద్దవడుగూరు: ప్రతి ఒక్కరూ మహాత్ముని అడుగు జాడల్లో నడవాలని వైఎస్సార్‌సీపీ అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, ప్రకాష్‌రెడ్డి , సీపీఐ నాయకులు సుధాకర్‌గౌడ్, శ్రీరాములు, స్వచ్ఛభారత్ కమిటీ సభ్యులు రిటైర్డ్ ఉపాధ్యాయులు ఈశ్వరప్ప, నారాయణస్వామి పేర్కొన్నారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో స్వచ్ఛ భారత్‌పై ర్యాలీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పామిడి: స్థానిక పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గాంధీజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఇల్లూరు ఉపేంద్ర ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటంతో పంచాయతీ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. అక్కడ గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవ రెడ్డి, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి అనుంపల్లి సూరి, పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కవి నారాయణమూర్తి, మాజీ మండల అధ్యక్షుడు బీవీ రత్నమయ్య పాల్గొన్నారు.

గుత్తి రూరల్: మండల్యవాప్తంగా సోమవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శివాజీరెడ్డి, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో డీఈ రాజ్‌కుమార్ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు గురుమస్తాన్, బేడల లక్ష్మిదేవి, రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ తిరుపాలమ్మ, సీఎస్‌డీటీ సూర్యనారాయణ, ఆర్ఐ సందీప్ పాల్గొన్నారు.

తాడిపత్రి: గాంధీజీ జయంతిని పురస్కరించుకుని సోమవారం వైఎస్సార్‌సీపీ యువ నేత కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి, పార్టీ శ్రేణులతో కలసి పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో జాతిపితకు పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీజీ దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన ఉద్యమాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పేరం స్వర్ణలత, జిల్లా ఉపాధ్యక్షుడు దూదేకుల బాబయ్య, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. ఇక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మునివేలు, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జి.రవి గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ప్రధాని మోదీకి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు రామాంజినేయులు, నాగరంగయ్య, నరసింహారెడ్డి, ఓబులేసు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని సూర్య హై స్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూదేకుల బాబయ్య ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు.

నార్పల: ప్రతి ఒక్కరూ గాంధీజీ బాటలో నడవాలని జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరరావు, సర్పంచ్ సుప్రియ కోరారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గవ్వల శ్రీరాములు, ఎంపీటీసీ శంకర్ యాదవ్, ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్‌డీ లక్ష్మీ నరసింహ, పంచాయతీ కార్యదర్శి అశ్వత్థనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండలవ్యాప్తంగా సోమవారం గాంధీజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, ఎంపీడీఓ తేజోత్స్న గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఎస్టీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ వెంకటేష్, సిబ్బంది, విద్యార్థులు గాంధీ జయంతి నిర్వహించారు. ఎంపీటీసీలు కాలువ వెంకటలక్ష్మి, శిరీష, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏఓ శ్రీవాణి, ఏపీఓ పోలేరయ్య, కొండమ్మ, సాకే లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచు సుబ్బమ్మ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత గాంధీజీ

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: శాంతి, అహింస అనే ఆయుధాలతో దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన మహాత్మా గాంధీ నేటి యువతకు స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా గాంధీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. గాంధీజీ శాంతియుత పద్ధతులతోనే రవి అస్తమించిన బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాకారం చేస్తున్నారని గుర్తు చేశారు. గాంధీజీ బాటలోనే జగనన్న ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



పామిడిలో గాంధీజీ చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గాంధీజీ విగ్రహం ఆవిష్కరణ



గుత్తి: గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రైల్వే ఎస్పీ చౌడేశ్వరి

గుత్తి: స్థానిక స్పెషల్ సబ్ జైలు ఆవరణలో గాంధీ జయంతి(ఖైదీల సంక్షేమ దినోత్సవం)ని పురస్కరించుకుని సోమవారం గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గుంతకల్లు రైల్వే ఎస్పీ చౌడేశ్వరి, జూనియర్ సివిల్ జడ్జి దీప్తి మాట్లాడుతూ గాంధీ అహింస, సత్యం, శాంతి వంటి పద్ధతుల ద్వారా జనాలను కదిలించి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారన్నారు. ప్రతి ఒక్కరూ గాంధీని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. సబ్ జైలు సూపరింటెంట్ మహేశ్వరుడు, సీనియర్ సిటిజన్ సూర్యనారాయణరెడ్డి, సీఐ వెంకటరామిరెడ్డి, గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపకుడు విజయ భాస్కర్, యువజన సంఘం నేత దేవేంద్ర రాయల్, న్యాయవాది కుమార్, డాక్యుమెంటరీ రైటర్ బండి సత్య, శ్రీధర్ గౌడ్ శంకరయ్య, సాదిక్, సబ్ జైలు సిబ్బంది, పాల్గొన్నారు.



తాడిపత్రి: గాంధీజి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి తదితరులు



నార్పల: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ

బాధిత కుటుంబానికి పరామర్శ



డీలరు సుమలత మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

యాడికి: దైవాలమడుగు గ్రామానికి చెందిన రేషన్ డీలర్ సుమలత ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి సోమవారం గ్రామానికి చేరుకుని సుమలత మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇదే ప్రమాదంలో గాయపడిన సుమలత భర్త, వైఎస్సార్‌సీపీ నేత తిరుమలరెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ వారికి ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా సీఎస్‌డీటీ సూర్య నారాయణ, మండలంలోని డీలర్లు సుమలత మృతదేహం వద్ద నివాళులర్పించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకుడు బ్రహ్మానంద రెడ్డి, లక్షుంపల్లె సర్పంచు పద్మనాభరెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, నాగేష్, రషీద్, వెంకటరామిరెడ్డి, హనుమంత రెడ్డి శివకేశవ రెడ్డి, శాంతారెడ్డి తదితరులు ఉన్నారు.

ఉమ్రా యాత్ర దిగ్విజయం కావాలి



ముస్లింలతో ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

యల్లనూరు: ముస్లింల ఉమ్రా(మక్కా) యాత్ర దిగ్విజయం కావాలని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆకాంక్షించారు. సోమవారం మండల కేంద్రంలోని అచ్చుకట్ల వీధిలో పీర్లచావిడి వద్ద మైనార్టీ నాయకుడు చాంద్‌బాషా ఏర్పాటు చేసిన ప్రార్థనలకు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ యల్లనూరు నుంచి 33 మంది ముస్లింలు నెలరోజులు ఉమ్రా యాత్ర చేయడం సంతోషకరమన్నారు. అనంతరం ముస్లింలు ఆలూరు సాంబశివారెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఉమ్రా యాత్రకు వెళ్లేవారిలో చాంద్‌బాషా, గౌస్‌పీర్, మహమ్మద్ రఫీ, రహంతుల్లా, హైదర్, మగ్బుల్, హాజీవలి, రఫీ, మదార్ ఉన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనరు పెద్దిరెడ్డి, నాయకులు రియాజ్, ఓబులేసు, (చేటప్ప), నాగరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

శింగనమల: బుక్కరాయసముద్రం మండలం బీకేఎస్ -1,2 సచివాలయాలు, గార్లదిన్నె మండలం బూదేడు, నార్పల మండలం బొందలవాడ, పుట్లూరు మండలం దోశలేడు, శింగనమల మండలం సోదనపల్లి, యల్లనూరు మండలం వెన్నపూసపల్లి సచివాలయాల్లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు జరగనున్నాయి. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

తాడిపత్రి: చుక్కలూరు సచివాలయం - 2 పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రంగారావు సోమవారం తెలిపారు. వివిధ రకాల జబ్బులతో భాధపడుతున్న వారికి ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తామన్నారు.

గుత్తి రూరల్: బసినేపల్లి గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివాజీరెడ్డి తెలిపారు. గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు.

పెద్దవడుగూరు : కిష్టిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేసినట్లు క్రిష్టిపాడు ఆరోగ్య కేంద్రం వైద్యుడు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టిఫిన్ సెంటర్లకు అడ్డాగా బస్‌షెల్టర్లు

- రోడ్డుపైనే వాహనాల నిలిపివేత
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



ఎగువపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: 44వ జాతీయ రహదారిపై ప్రయాణికులు, వాహనదారులకు కోసం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లు టిఫిన్ సెంటర్లకు అడ్డాగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు తప్పడం లేదు. వివరాల్లో కెళితే.. మండల కేంద్రం గార్లదిన్నె విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి పామిడి వరకు జాతీయ రహదారిపై బస్‌షెల్టర్లు ఉన్న ప్రాంతాల్లో కొంత మంది టిఫిన్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. ఉదయం టిఫిన్ సెంటర్ల వద్ద అధిక సంఖ్యలో రోడ్డుపై వాహనాలు నిలపడంతో ప్రయాణికులు, వాహన దారులకు అవస్థలు తప్పడం లేదు. టిఫిన్ సెంటర్లున్న చోట ఏదైనా ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అథారిటీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముందు జాగ్రత్తలతో రోగాల నివారణ



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుధాకర్

కూడేరు: ముందస్తు జాగ్రత్తలతో పశువులకు రోగాలు రాకుండా నివారించవచ్చని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వాహణాధికారి (డీఎల్‌డీఏ ఈఓ) డాక్టర్ సుధాకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముద్దలాపురంలో ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన పథకం కింద వాటర్ షెడ్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సుధాకర్ పశువులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు, పశు దాణా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి పెంపకం లాభసాటిగా ఉంటుందన్నారు. పశుగ్రాసంతో పాటు దాణా అందిస్తే పాల దిగుబడి పెరుగుతుందన్నారు. ఆడ దూడలు పుట్టేందుకు ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ ఏపీడీ సుధాకర్ రెడ్డి, పీఓ ఈశ్వరయ్య, టీఓ విశ్వనాథ్‌రెడ్డి, మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు, ఏహెచ్‌ఏ సుభహాన్, గోపాల మిత్ర రాఘవ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

గుంతకల్లు: ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య సూచించారు. సోమవారం గంగనగర్‌లోని ఇరానీ కాలనీలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని నేరస్తుల ఇళ్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ కాలనీలో కొత్త వ్యక్తులు, అనుమానితులు ఎవరైనా కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్ఐ నరేంద్ర, వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

శింగనమల: జాతీయ ఉపాధి హామీ కింద 2024–25 ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపు కోసం మంగళవారం నుంచి మండలంలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నిర్మలాకుమారి సోమవారం తెలిపారు.

ఈనెల 28 వరకూ గ్రామసభ నిర్వహిస్తామన్నారు.

గుంతకల్లు-చిక్‌జాజూర్ రైలు సేవల నిలిపివేత

రాయదుర్గంటౌన్: గుంతకల్లు నుంచి చిక్‌జాజూర్‌కు (రాయదుర్గం మీదుగా) నడిచే స్పెషల్ ప్యాసింజర్ రైలు(07585/07586) రాకపోకలను 18 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు సౌత్‌వెస్ట్రన్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ రైలు రాకపోకలు ఉండవని పేర్కొన్నారు.

గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలు



జేఎన్‌టీయూ అనంతపురంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్

అనంతపురం: జేఎన్‌టీయూఏ పాలక భవనంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణ కాంతి, డాక్టర్ డి.విష్ణువర్ధన్, ప్రొఫెసర్ సురేష్ బాబు, ప్రొఫెసర్ చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఎస్కేయూలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.అనిత, ప్రొఫెసర్లు వెంకటనాయుడు, ప్రొఫెసర్ శోభాలత, రాంగోపాల్, డాక్టర్ సత్యనారాయణ, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీరాములునాయక్, డిప్యూటీ రిజిస్ట్రార్ లక్ష్మీరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ, సంస్థ కార్యదర్శి రమ తదితరులు పాల్గొన్నారు.
- జేఎన్‌టీయూ–ఓటీపీఆర్ఐలో ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్కా గోపీనాథ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

తాడిపత్రి అర్బన్: పట్టణానికి చెందిన ఓ వ్యక్తి డాక్టర్ సూచించిన మందులు కాకుండా వేరే మందులు వాడటంతో మృతి చెందాడు. అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన కొణతల నాగరాజు కుమార్(55) 30 ఏళ్లుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతుండేవాడు. అయితే ఇటీవల నాగరాజుకు అధిక విరేచనాలు కావడంతో డాక్టర్ వద్దకు వెళ్లగా చికిత్స చేసి ట్యాబ్లెట్లు ఇచ్చారు. ఈ క్రమంలో విరేచనాల ట్యాబ్లెట్లకు బదులు మూర్ఛ ట్యాబ్లెట్లు వేసుకోవడంతో సెప్టెంబర్ 30న తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య ప్రసన్నలక్ష్మి, కుమారుడు చరణ్ తేజ్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్లు సీఐ తెలిపారు.

ఆర్థో విభాగానికి పరికరాల వితరణ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఆర్థో విభాగానికి గుంతకల్లు లైఫ్ లైన్ ఆస్పత్రి ఆర్థో వైద్యుడు డాక్టర్ జిలాని రూ.30 వేల పరికరాలను అందజేశారు. సోమవారం జీజీహెచ్‌లో ఆర్థో హెచ్ఓడీ డాక్టర్ ఆత్మరాంకు డాక్టర్ జిలానీ పరికరాలు అందజేశారు.